మెట్ల మార్గాలు శిథిలం

- కొండవాలులో నాచు పట్టిన మెట్లు
- ప్రమాదాల బారిన పాదచారులు
- పట్టించుకోని అధికారులు


అరుంధతి నగర్‌లో ప్రమాదభరితంగా మెట్ల మార్గం

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల్లో మెట్లమార్గాలు శిథిలం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 46, 47, 48 వార్డు కంచరపాలెం పరిధిలో ఈ సమస్య నెలకొంది. మెట్ల మార్గాల్లో సిమెంటు రోడ్లు వేయకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు రాళ్లు తేలుతున్నాయి. ఎవరింటి ముందు, వారు సిమెంటుతో మెట్లకు మరమ్మతులు చేసుకునే పరిస్థితి ఉంది. ఆయా వార్డుల పరిధిలోని మధుసూదన్ నగర్, సంతోష్‌నగర్, కప్పరాడ, సంజీవయ్య కాలనీ, శాంతినగర్, కస్తూరినగర్, రాంజీ ఎస్టేట్, అరుంధతి నగర్, సాయిరామ్ నగర్, అంబేడ్కర్ ఎస్టేట్, బాపూజీనగర్, శివలింగపురం, శ్రీనివాస నగర్, ఇందిరానగర్, జైభారత్‌నగర్ తదితర ప్రాంతాల్లో మెట్ల మార్గాలు నాచు పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి.

వెలగని విద్యుద్దీపాలు

విద్యుద్దీపాలు సక్రమంగా పని చేయడం లేదు. వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చేందుకు సిబ్బంది ముందుకు రాకపోవడంతో కొండవాలు ప్రాంతాల్లో అంధకారం అలముకుంటోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మెట్లమార్గాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినా, పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు స్పందించి మెట్ల మార్గాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


అధ్వానంగా రాంజీ ఎస్టేట్ మెట్ల మార్గం

నడవాలంటే భయం

మెట్ల దారుల్లో రాళ్లు తేలిపోయాయి. వాటిపై నడవాలన్నా భయంగానే ఉంటోంది. ఇక వర్షం వస్తే అంతే సంగతులు. నీరు నిల్వ ఉండిపోయి నాచు పట్టేస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయం. అధికారులు స్పందించి, మరమ్మతులు చేయాలి.

– జి.బాబూరావు, కప్పరాడ, కంచరపాలెం

మెటీరియల్ తరలింపులో ఇబ్బంది వల్లే జాప్యం

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. మెట్లమార్గాల మరమ్మతులకు శంకుస్థాపన కూడా జరిగింది. అయితే, కొండవాలు ప్రాంతాలు కావడంతో కాంట్రాక్టర్లకు మెటీరియల్స్ తరలించేందుకు ఇబ్బందిగా మారింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు త్వరితగతిన ప్రారంభించి మెట్లమార్గాల మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– భరణికుమార్, డీఈ, జోన్–5 ఇంజినీరింగ్ విభాగం

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి


చెత్త సేకరణ విధానంపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ

మురళీనగర్: ప్రజలు తమ నివాసాల్లోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సూచించారు. విశాఖ స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా ఆయన 49వ వార్డు బర్మా కాలనీ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడి, తడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తను ప్రత్యేకంగా వేరు చేసి ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్సీ సూచించారు. ఇంటింటికీ సిబ్బంది వచ్చి చెత్త సేకరిస్తున్నదీ, లేనిదీ ఆయన పరిశీలించారు. డెంగ్యూ వ్యాధి నివారణకు నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త


ట్రెజరీ కార్యాలయం రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార జిల్లా ట్రెజరీ కార్యాలయం రోడ్డులో చెత్త పేరుకుపోయింది. చెత్త కుళ్లిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల డస్ట్‌బిన్‌లు చెత్తతో నిండిపోయాయి. దీంతో చెత్త రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. అధికారులు స్పందించి చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు


సాగర్ వ్యూ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ నివాసితులకు కల్పించిన పలు అభివృద్ధి పనులను శుక్రవారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో ఆధునికీకరించిన తరగతి గదిని ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతితో కలసి ఆయన ప్రారంభించారు. చిన్నారుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ తరగతి గది ఉపయోగపడుతుందని డీఆర్‌ఎం తెలిపారు. రైల్వే కాలనీలో నివసిస్తున్న సిబ్బంది, వారి కుటుంబాల సౌకర్యార్థం దొండపర్తిలోని డాల్ఫిన్ నోస్ కాలనీలో సుమారు ఎకరం స్థలంలో అభివృద్ధి చేసిన వాకర్స్ పార్క్‌కు డీఆర్‌ఎం ప్రారంభోత్సవం చేశారు. ఈ పార్కులో సుమారు 500 మీటర్ల వాకర్స్ ట్రాక్‌తో పాటు బెంచీలు ఏర్పాటు చేశారు. అనంతరం 5–టైప్ రైల్వే బంగళాలో 1.25 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకును సాగర్ వ్యూ రైల్వే కాలనీలో డీఆర్‌ఎం ప్రారంభించారు.

కొనసాగుతున్న భాగవత సప్తాహం


ప్రవచనం చేస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

సీతంపేట: లలితాపీఠంలో భాగవత సప్తాహం అద్భుతంగా సాగుతోంది. కుర్తాళం, లలితాపీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి రోజూ సాయంత్రం భాగవతంలోని ఒక అంశంపై ప్రవచనం చేస్తున్నారు. దీనిలో భాగంగా నాలుగో రోజు హిరణ్యకశ్యప, హిరణ్యాక్షుల జనన వృత్తాంతాన్ని వివరించారు. శ్రీమహావిష్ణువు శ్వేత వరాహ రూపంలో హిరణ్యాక్షుడిని వధించిన విధాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించారు. హిరణ్యకశ్యపుని తపో వృత్తాంతాన్ని, బ్రహ్మ వరాలను, ప్రహ్లాద చరిత్రను విశ్లేషించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని, కుర్తాళం సీఈవో మోచర్ల శశిభూషణ్, ఆస్థాన వేద పండితులు మాచవోలు రమేష్ శర్మ, లలితా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణ సేన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సౌందర్యలహరి పారాయణం


మాట్లాడుతున్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి


సీతంపేట: రేవతి నక్షత్రాన్ని పురస్కరించుకుని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఆదేశాల మేరకు శంకరమఠంలో కామాక్షి అమ్మవారి సన్నిధిలో సౌందర్యలహరి పారాయణం, యంత్ర పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి స్వామి సౌందర్యలహరి పారాయణం వల్ల కలిగే పుణ్యఫలాలను భక్తులకు వివరించారు. ప్రతీ శ్లోకానికి అర్థం తెలియజేశారు.

ఆరేళ్ల తరువాత కుటుంబ సభ్యుల చెంతకు..


కుటుంబ సభ్యులకు సుభాష్‌ను అప్పగిస్తున్న మురళి, తదితరులు

ఎంవీపీ కాలనీ: మానసిక స్థితి బాగోలేక కుటుంబానికి దూరమైన సుభాష్ చంద్రబోస్ అనే వ్యక్తిని ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన చంద్రబోస్ ఎలక్ట్రికల్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఆరేళ్ల క్రితం చెట్టు మీద నుంచి పడిపోవడంతో తలకు గాయమైంది. అప్పటి నుంచి మానసిక స్థితి బాగోకపోవడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అయితే అక్కడి నుంచి తప్పించుకున్న సుభాష్ విశాఖ చేరుకున్నాడు. జగదాంబ కూడలిలో బట్టలు లేకుండా తిరుగుతున్న అతన్ని గమనించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు మహారాణిపేట పోలీసుల సహకారంతో విశాఖ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. కొంత కాలంగా చికిత్స పొందుతున్న సుభాష్ ఆరోగ్యం నయం కావడంతో తన కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేశాడు. దీంతో పెద్దాపురంలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం రెడ్ క్రాస్ ప్రతినిధులు మురళి ఆధ్వర్యంలో సుభాష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు తల వెంట్రుకలు దానం చేసి వారిలో ఆత్మ విశ్వాసం నింపాలని ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. వింగ్స్ ఫర్ లైఫ్, హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో స్ట్రాండ్స్ ఆఫ్ హోప్ అండ్ కరేజ్ 'హెయిర్ డొనేషన్ డ్రైవ్'పోస్టర్‌ను ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వింగ్స్ ఫర్ లైఫ్ ప్రతినిధులు జ్యోతిర్మయి, రష్మి మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు సీతమ్మధారలోని నేచురల్ బ్యూటీ సెలూన్‌లో ప్రజలు స్వచ్ఛందంగా తమ జుట్టును దానం చేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

అవార్డు గ్రహీతలకు తహసీల్దార్ అభినందన


డీటీకి, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్న తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్

సీతమ్మధార: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి, ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న రెవెన్యూ ఉద్యోగులను తహసీల్దార్ పేర్ల శ్యామ్ ప్రసాద్ అభినందించారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ లొడగల చేతన్‌కుమార్, వీఆర్వోలు వి.ఎల్.ఎన్.మూర్తి, ఎస్.కె.ఖాదర్‌బాబా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలు పొందారు. ఈ సందర్భంగా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను తహసీల్దార్ అభినందించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు సాయం


విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న తిమ్మారెడ్డి

సీతంపేట: తెలుగు మహిళా సాధికారత సంఘం తరఫున ఝాన్సీరెడ్డి, శైలజ కల్లూరి సహకారంతో అక్కయ్యపాలెంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీకి సాయం అందించారు. సొసైటీలో శిక్షణ పొందుతున్న దివ్యాంగ విద్యార్థులకు 65 జతల యూనిఫారాలు, 7 హాట్ పాట్స్, ఎలక్ట్రికల్ కుక్కర్, 21 మంది విద్యార్థులకు బోధన పరీక్ష రుసుం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ తిమ్మారెడ్డి, ఏయూ దూరవిద్య డైరెక్టర్ విశ్వేశ్వరరావు, విశ్రాంత అడ్మిరల్ రవికిరణ్, సొసైటీ అధ్యక్షురాలు సుచిత్రారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనరస, సునంద్

సీతంపేట: కర్నూలులో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పోటీలలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభకనబరిచారు. వాలీబాల్ పోటీలో రన్నర్స్‌గా నిలిచారు. వీరి లో జి.శ్రీసంజన, జి.ప్రవల్లిక, ఎం.విజయలక్ష్మి సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరస, పీడీ సునంద్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

యోగా, ధ్యానంతో మానసిక ఆరోగ్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, ఆనంద్ మార్గ్ ప్రచారక సంఘం సంయుక్తంగా రెండు రోజుల యోగా, ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించాయి. ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.రాజేంద్ర కర్మార్కర్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా అతిథులు ప్రభాత్ రంజన్ సర్కార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్ర కర్మార్కర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసికంగా ధృడంగా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం ఉపకరిస్తాయన్నారు. రినైసెన్స్ యూనివర్సల్(ఆర్‌యూ) కార్యదర్శి ఆచార్య వితమోహనానంద విద్యార్థులకు యోగా ప్రాధాన్యత, నిత్య జీవనంలో ఉపయోగాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఆర్‌యూ ప్రతనిధి నారాయణ పాండా, ఏయూ ఎన్ఎస్ఎస్ ట్రెనింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రామచంద్రరావు, స్టీల్‌ప్లాంట్ ఏజీఎం ఎ.వి.వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

పోరాటాలను అవహేళన చేస్తే మూల్యం తప్పదు


మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

ఉక్కునగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలను అవహేళన చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేకతపై పోరాడుతున్న వారిలో మత విద్వేశాలను సృష్టించడం, ఐక్యతకు విఘాతం కలిగించడం, ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు ధారపోయడం కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ పరిశ్రమల రక్షణ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అనకాపల్లి జిల్లా సీఐటీయూ కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దారుణమన్నారు. జిల్లా జాక్ కన్వీనర్ ఎం.జగ్గునాయుడు, సీఐటీయూ నాయకులు వై.టి.దాస్, కె.ఎం.శ్రీనివాస్, ఎన్.రామారావు, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నావికా దళ సిబ్బంది రక్తదానం


రక్తదానం చేస్తున్న నావికా దళ సిబ్బంది

ఎంవీపీ కాలనీ: ఈస్టర్న్ నావల్ కమాండ్ ఐఎన్ఎస్ సర్కార్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకులో జరిగిన ఈ శిబిరాన్ని కమాండ్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ఆర్.ఆర్.రవి ప్రారంభించారు. అనంతరం 17 మంది మహిళలతో పాటు 163 మంది సిబ్బంది రక్తదానం చేశారు.

నేడు డాక్టర్ శ్వేత కూచిపూడి నాట్య రంగ ప్రవేశం


మాట్లాడుతున్న కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఇన్‌చార్జి హనుమంతరావు

ఆరిలోవ: డాక్టర్ శ్వేత శనివారం కూచిపూడిలో రంగ ప్రవేశం చేయనున్నట్లు కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి హనుమంతరావు తెలిపారు. విశాఖ వేలీ స్కూల్ పక్కన కూచిపూడి ఆర్ట్స్ అకాడమీలో శుక్రవారం నాట్యకారిణి శ్వేతతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28న సాయంత్రం 6.30 గంటలకు కళాభారతిలో రెండు గంటల పాటు నిరాటంకంగా నృత్య ప్రదర్శన చేయనున్నట్లు చెప్పారు. ఆమె 8వ ఏట నుంచే తన వద్ద నాట్యం నేర్చుకుంటూనే వైద్య విద్యను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇప్పుడు సహృదయ విద్వత్ జన సభ రంగ ప్రవేశం కోసం నాట్యం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో శ్వేత తండ్రి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'మార్చి నాటికి కైలాసగిరి పార్కు సుందరీకరణ'

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం కైలాసగిరి పార్కును మార్చి నాటికి సుందరంగా తయారు చేస్తామని వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజినీర్ శివప్రసాద్‌రాజు తెలిపారు. 'అధ్వానంగా కైలాసగిరి పరిసరాలు'అనే శీర్షికతో ఈ నెల 23న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దీంతో ఈ ఏడాది మార్చిలో జరగనున్న జి.20 సదస్సుకు పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని ఓ ప్రకటనలో తెలిపారు. కొండపై రాతి శిల్పాల పార్కులో నడకదారులు బాగు చేయడం, పచ్చదనం కోసం మొక్కలు నాటడం వంటి పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా శంఖు చక్ర నామాలు నుంచి తెలుగు మ్యూజియం వరకు సర్వీస్ రోడ్డులో డెక్ పనులు, నడక మార్గం పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా రోడ్డు తవ్విన వైపు సందర్శకులు ఎవ్వరూ వెళ్లకుండా స్టాపర్లు అడ్డం పెట్టామన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి స్టాపర్లు తొలగిస్తామన్నారు. ఈ పనులు రూ.29 లక్షలతో జరుగుతున్నట్టు తెలిపారు.

ఆర్టీసీలో రోడ్డు భద్రత వారోత్సవాలు ప్రారంభం


వారోత్సవాల గురించి వివరిస్తున్న ఆర్టీసీ డీపీటీవో ఎ.అప్పలరాజు

మద్దిలపాలెం: ప్రజా రవాణా వ్యవస్థ(ఆర్టీసీ)లో రోడ్డు భద్రత వారోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ ఉత్సవాలు వచ్చేనెల 2వ తేదీ వరకూ కొనసాగుతాయని డీపీటీవో ఎ.అప్పలరాజు తెలిపారు. మద్దిలపాలెం డిపోలో డిపో మేనేజర్ అరుణకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బందికి బస్సుల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అలనాటి నటి జమున మృతి తీరని లోటు

- విశాఖతో జమునకు అవినాభావ సంబంధం


స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జమునకు విశాఖలో ఘన సత్కారం(ఫైల్‌ఫొటో)

మద్దిలపాలెం: అలనాటి కథానాయిక జమునకు విశాఖతో అవినాభావ సంబంధం ఉంది. విశాఖ వేదికగా నిర్వహించే పలు సినీ కార్యక్రమాలలో ఆమె ఎన్నోసార్లు పాల్గొని సందడి చేశారు. టి.సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన అనేక కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. నగరానికి చెందిన స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమీ అధినేత మూర్తి సంస్థ వార్షికోత్సవానికి జమునను ఆహ్వానించి సత్కరించారు. నగరానికి చెందిన ఘంటసాల కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా ఆమెకు సన్మానం చేశారు. తెలుగు, హిందీ, తమిళ తదితర భాషలలో నటించి ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోయిన జమున అకాల మరణం చాలా బాధాకరమని ఘంటసాల కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు అన్నారు. జమున మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సంతాపం తెలిపారు. జమున సంతాప సభ ఆదివారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఏయూ మానవ వనరులు అభివృద్ధి శాఖ ప్రాంగణంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎండాడ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో కాకినాడలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

కల్యాణం.. కమనీయం


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు పరిధి దొండపర్తిలోని ఎరుకుమాంబ ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఆలయ సిబ్బందితో వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, ఆలయ కార్యనిర్వహణాధికారి రమ భేటీ అయ్యారు. ఒకటో తేదీన భీష్మ ఏకాదశి, 18వ తేదీన మహాశివరాత్రి ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, సబ్బి నూకరాజు, వెంకటరత్నం, దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

29న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

దాబాగార్డెన్స్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సహకారంతో స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఏఎస్ బీచ్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ జహీర్ అహ్మద్, పిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ ముస్తఫా అహ్మద్, రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ చేతుల మీదుగా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా క్యాంప్ కో ఆర్డినేటర్ ఎం, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ప్రత్యేకంగా నిరుపేదలకు డాక్టర్ సలహా మేరకు కాటరాక్ట్ శస్త్ర చికిత్స, లెన్స్ అమరిక ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు, 39వ వార్డు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.